క్లుప్తంగా

అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. అంబేడ్కర్ కాలనీ దుర్గాదేవి ఆలయంలోని అమ్మవారిని స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీషతో కలిసి గురువారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారిని భక్తితో సేవిస్తే సకల కష్టాలు తీరుతాయని తెలిపారు. అనంతరం అమ్మవారికి పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

3న ఏపీజే అబ్దుల్ కలాం అవార్డుల ప్రదానం

విజయవాడకల్చరల్: ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థ, బ్రహ్మదేశం సోషల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ 3వ తేదీ సాయంత్రం గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో వివిధ రంగాల్లోని సేవా మూర్తులకు అబ్దుల్ కలాం అవార్డుల ప్రదానం చేస్తున్నట్లు ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొంటారన్నారు.

బాబాసేవలో ఆదాయ పన్ను ప్రధాన కమిషనర్ సునీత



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఆదాయపు పన్ను ప్రధాన కమిషనర్ సునీత బిళ్ళా గురువారం బాబాను దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన బాబాను దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. షిర్డీలో మాదిరిగా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న మందిర కమిటీ సేవలను అభినందించారు. తొలుత అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. బాబావారి శేషవస్త్రం, చిత్రపటంతో సునీత బిళ్ళాను సత్కరించారు. కార్యక్రమంలో మందిర కమిటీ కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి పాల్గొన్నారు.

చిన్నారులకు విద్యాసామగ్రి పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడుకు చెందిన హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన నిరుపేద, హెచ్ఐవీ బాధిత చిన్నారులకు విద్యాసామగ్రిని గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, మల్లిక మాట్లాడుతూ ప్రపంచ ఎయిడ్స్ డే పురస్కరించుకుని నిరుపేద చిన్నారులకు అవసరమైన పుస్తకాలు, ప్యాడ్, పెన్నులు, బ్యాగులు పంపిణీ చేస్తున్నామన్నారు. తాము చేస్తున్న సేవలకు సహకరిస్తున్న దాతలు, ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఏఆర్‌టీ సెంటర్ కౌన్సిలర్ కనకాల వరప్రసాద్ హెచ్ఐవీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వచ్చిన వారు ఏవిధంగా ఉండాలో వివరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు హేమంతరావు, వెంకటేశ్వరరావు, సాయి, వైఆర్జీ కేర్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది నాగూర్‌బీ, రాములు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ గెజిట్‌ను ఉపసంహరించుకోవాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ నెం.4204 నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని పలువురు వక్తలు అన్నారు. ఐలాపురం హోటల్‌లో ఇటీవల మృతిచెందిన రైతాంగ సమాఖ్య అధ్యక్షుడు యెర్నేని నాగేంద్రనాథ్, చెరుకూరి వీరయ్య, చలసాని సుబ్బారావుల సంతాప సభ జరిగింది. తొలుత వారి చిత్రపటాలకు రైతు సంఘం నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రైతు నాయకుడు అక్కినేని భవానీప్రసాద్ అధ్యక్షతన కృష్ణా-గోదావరి నదీ జలాల పంపిణీపై చర్చావేదిక జరిగింది. ఇందులో కృష్ణా-గోదావరి నదీ జలాల పంపిణీ, బచావత్ ట్రిబ్యునల్, బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్, విభజన చట్టంపై చర్చించారు. వక్తలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ రైతు సమస్యల పట్ల యెర్నేని నాగేంద్రనాథ్ సాగించిన పోరాటం మరువలేనిదన్నారు. సభలో రిటైర్డ్ ఇంజినీర్ కే పాపారావు, యలమంచిలి శివాజీ, యెర్నేని సీతాదేవి, వై కేశవరావు, దశరాథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనతో సుస్థిర అభివృద్ధి

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



24వ డివిజన్‌లో సంక్షేమాభివృద్ధి బోర్డు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాజకీయాలకు అతీతంగా నిష్పక్షపాత పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతో రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధి సాధ్యమైందని, పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడినట్లు ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 31వ డివిజన్ 211వ వార్డు సచివాలయ పరిధిలో జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీషతో కలిసి గురువారం ఆయన పాల్గొన్నారు. తొలుత మహానేత వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించి, పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం సచివాలయం వద్ద సంక్షేమాభివృద్ధి బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో ముందుకు తీసుకువెళ్తూ పల్లెల్లో 92 శాతం మంది ప్రజలకు, పట్టణాలలో 87 శాతం మందికి ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి చేకూర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. 211వ వార్డు సచివాలయ పరిధిలో గత నాలుగున్నరేళ్లలో డీబీటీ ద్వారా 6 కోట్ల 25 లక్షల 46 వేల 913 రూపాయల లబ్ధి చేకూర్చగా నాన్ డీబీటీ ద్వారా 8 కోట్ల 34 లక్షల ఒక వేయి 179 రూపాయలు మేలు జరిగినట్లు వెల్లడించారు. టీడీపీ హయాంలో నవరత్నాలు వంటి ఒక్క కార్యక్రమాన్ని అయినా చంద్రబాబు చేపట్టగలిగారా.. అని ఎమ్మెల్యే మల్లాది ప్రశ్నించారు. తమ ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాద బలం మెండుగా ఉందని రానున్న ఎన్నికల్లో తిరుగులేని మెజార్టీతో జగనన్న మరోసారి సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు టి.మురళీకృష్ణంరాజు, కంభం కొండలరావు, వార్డు సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

24వ డివిజన్‌లో....

లబ్బీపేట(విజయవాడతూర్పు): 24వ డివిజన్ 88వ వార్డు సచివాలయ పరిధిలో జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రయంలో గురువారం ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొన్నారు. ముందుగా మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి సచివాలయంలో సంక్షేమాభివృద్ధి బోర్డును ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాని ఎగరవేశారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ 88వ సచివాలయం పరిధిలో గత నాలుగున్నరేళ్లలో డీబీటీ ద్వారా రూ.9.04 కోట్లు, నాన్ డీబీటీతో రూ.4.69 కోట్లు లబ్ధిదారులకు ఇచ్చామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ అనిత, పార్టీ నేతలు పాల్గొన్నారు.



59వ డివిజన్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

59వ డివిజన్‌లో....

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): 59వ డివిజన్ 253వ వార్డు సచివాలయ పరిధిలో జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు గురువారం పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానాతో కలిసి ఆయన పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద సంక్షేమాభివృద్ధి బోర్డును ఆవిష్కరించారు. మనందరి ఉజ్వల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తున్న జగనన్నకు మనమంతా ఎల్లప్పుడూ తోడుగా ఉండాలని ఎమ్మెల్యే విష్ణు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, నందెపు సురేష్, దేవిరెడ్డి రమేష్‌రెడ్డి, షేక్ అమిత్, షేక్ చింతా శ్రీను, కొండా జయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నవ సమాజ స్థాపనకు సీఎం జగన్ కృషి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నవ సమాజ స్థాపనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి ఎనలేనిదని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 58వ డివిజన్ 240వ వార్డు సచివాలయ పరిధిలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజాతో కలిసి గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు, ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు తెలియజెప్పేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతోందని తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగమంతా ప్రజల ఇంటి వద్దకే వస్తుండటంతో సుదీర్ఘకాలం స్థానికంగా నెలకొన్న అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తోందని చెప్పారు. అలాగే గడప గడపకు మన ప్రభుత్వంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి సైతం ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. పలు సమస్యలను ప్రత్యక్షంగా వీక్షించిన ఆయన నిర్ణీత వ్యవధిలోగా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.



సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

సీఎంని కించపరిస్తే ఉపేక్షించేది లేదు:

సీఎం జగన్‌ని కించపరుస్తూ టీడీపీ నేతలు వ్యాఖ్యలు చేస్తే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే మల్లాది విష్ణు హెచ్చరించారు. ముఖ్యంగా నారా లోకేష్ సీఎం జగన్‌పై అక్కసు వెళ్లగక్కుతుంటే మిగితా టీడీపీ నేతలు కలెక్టర్లు, అధికారులపై బురద చల్లుతున్నారని మండిపడ్డారు. టీడీపీ నేతలు పూర్తిగా గోబెల్స్ వారసులుగా మారిపోయారని పచ్చ మీడియాలో నీచ రాతలు రాయించుకుంటూ పైశాచిక ఆనందం పొందుతున్నారని ఆరోపించారు. మరోవైపు చంద్రబాబుకు జైల్లో ఉంటేనే అన్ని రోగాలు, ఆరోగ్య సమస్యలు గుర్తుకొస్తాయని, దేవాలయాలను సందర్శించే ముందు అధికారంలో ఉండగా హిందువుల మనోభావాలు దెబ్బతీసినందుకు బాబు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ సీఈ(ఇంజనీరింగ్) ప్రభాకర్‌రావు, ఈఈ శ్రీనివాస్, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, తోపుల వరలక్ష్మి, శోభన్, నేరెళ్ల శివప్రసాద్, మహేశ్వరి, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గగుడి టికెట్ల కౌంటర్‌లో పాము కలకలం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దర్శనం టికెట్లు జారీ చేసే కౌంటర్‌లోకి పాము దూరడంతో కలకలం చోటుచేసుకుంది. గురువారం మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన సమర్పించే క్రమంలో దర్శనాలు నిలిపివేశారు. అదే సమయంలో చిన్న గాలిగోపురం కింద ఉన్న టికెట్లు జారీ చేసే కౌంటర్‌లోకి పాము దూరడం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు గమనించి కేకలు వేశారు. దీంతో కౌంటర్‌లో విధులు నిర్వహిస్తున్న ఆలయ ఉద్యోగి రెడ్డి వెంటనే భయంతో కౌంటర్ నుంచి బయటకు పరుగులు పెట్టి కౌంటర్ డోర్ లాక్ చేశాడు. వెంటనే దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులకు సమాచారం అందించారు. అయితే వారు శానిటేషన్‌లో పని చేసే పాములు పట్టే వ్యక్తికి సమాచారం అందించారు. ఇంతలో కౌంటర్‌లో పాము ఎక్కడ ఉందో తెలుసుకునేందుకు సిబ్బంది ప్రయత్నించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తుల్లో భవానీపురానికి చెందిన యువకుడు చాకచక్యంగా పామును పట్టుకున్నాడు. అనంతరం పామును ఆలయం వెనుక భాగంలో ఉన్న తలసివనం కొండ ప్రాంతంలో వదిలిపెట్టారు. ఆలయ పరిసరాల్లో ఎప్పుడైనా పాము కనిపిస్తే తనకు సమాచారం ఇవ్వాలని ఆ యువకుడు ఆలయ సిబ్బందితో పేర్కొన్నాడు.

అబాకస్‌తో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుంది

మధురానగర్(విజయవాడసెంట్రల్): అబాకస్‌తో విద్యార్థుల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, మనోధైర్యం పెరుగుతుందని అబాకస్ సత్యనారాయణపురం బ్రాంచి నిర్వాహకురాలు శైలజ అన్నారు. సత్యనారాయణపురం బ్రాంచిలో సిప్ అబాకస్ నేషనల్ కాంపిటీషన్ విజేతల అభినందన కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సిప్ అబాకస్ జాతీయ పోటీల్లో 14 మంది విద్యార్థులు పాల్గొనగా 12 మంది విద్యార్థులు వివిధ కేటగిరిల్లో విజయం సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. అబాకస్‌తో విద్యార్థులు జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు సులభంగా చేరుకోవచ్చని తెలిపారు. అనంతరం విజేతలను జ్ఞాపికలతో సత్కరించారు.

వీఎంసీలో అట్టహాసంగా పదవీ విరమణలు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థలో వివిధ క్యాడర్లలో 40 ఏళ్లుగా విధులు నిర్వహించిన సర్కిల్ -3 నందు అసిస్టెంట్ కమిషనర్ ఎం.రాజ్‌కుమార్ గురువారం ఉద్యోగ విరమణ చేశారు. పటమటలోని సర్కిల్-3 కార్యాలయంలో రాజ్‌కుమార్ పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న డెప్యూటీ కమిషనర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. రాజ్‌కుమార్ అంకితభావంతో సేవలందించారన్నారు. అనంతరం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఎం.కృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్, డెప్యూటీ సిటీ ప్లానర్ జూబిన్, రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ సాంబశివరావు, అసోసియేషన్ సభ్యులు టి.నాగేశ్వరరావు, జి.ప్రకాష్ సాగర్, బి.ఉదయ్ భాస్కర్, పి.మధుసూదనరావు, మారుతీరావు, శ్యాంసురేంద్రబాబు, బిల్ కలెక్టర్లు, రెవెన్యూ ఇనస్పెక్టర్లు, ఇండోర్ సిబ్బంది, సచివాలయ సెక్రెటరీస్ పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగ విరమణ

నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో వార్డు స్పెషల్ సెల్‌లో జూనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్న నాగదుర్గ గురువారం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి ఆధ్వర్యంలో జరిగిన ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఏసీ మాట్లాడారు. వీఎంసీలో 35 ఏళ్ల సుదీర్ఘ సేవలు అందించిన నాగదుర్గ ఉద్యోగ విరమణ అనంతరం ప్రశాంత జీవనాన్ని గడపాలని కోరారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ సిబ్బంది పలు విభాగాల సూపరింటెండెంట్లు సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్, ఇంటర్ అసిస్టెంట్లు కింద స్థాయి ఉద్యోగులు సన్మానించారు. ఆమె సేవలను కొనియాడారు.



నాగదుర్గను సన్మానిస్తున్న ఏసీ సత్యవతి

5 నుంచి సంగీత విద్వాంసుడు పారుపల్లి జయంతి ఉత్సవాలు

విజయవాడ కల్చరల్: గాయక సార్వభౌమ సంగీత పరిషత్, స్వరఝురి సంగీత సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్ 5 నుంచి ఐదు రోజులపాటు గాంధీనగర్ చిట్టూరి హైస్కూల్ కళావేదికలో సంగీత విద్వాంసుడు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 140వ జయంతి సందర్భంగా సంగీతోత్సవాలు నిర్వహిస్తున్నట్లు స్వరఝురి సంస్థ కార్యదర్శి మోదుమూడి సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 5న సాత్విక, కే భువనకృతి, కొత్తపల్లి శ్రీదేవి ప్రవల్లిక గాత్ర సంగీత సభ, 6న హైదరాబాద్ సోదరుల వాయిలీన త్రయం, 7న మోదుమూడి సుధాకర్ కల్యాణ ఏకరాగ సభ, 8న సోమయాజుల విష్ణుప్రియ గాత్ర కచేరీ, 9న కొరిడే సుధీర్‌శర్మ(ఆస్ట్రేలియా) గాత్రం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.

గణితంతో ఉపాధి అవకాశాలు మెరుగు



మధురానగర్(విజయవాడసెంట్రల్): గణితంలో పట్టు సాధించడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవచ్చని ఆర్కే ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ కేవీ రామారావు అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యాన అతిథి ఉపన్యాసం గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గణితంపై కొద్దిపాటి శ్రద్ధ చూపిస్తే సులభంగా నేర్చుకోవచ్చని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గణితంలో ప్రావీణ్యం పెంచుకోవడం ద్వారా తక్కిన సబ్జెక్టుల్లో కూడా రాణించే అవకాశం ఉందన్నారు. అధ్యాపకులు కేవీ నాగలక్ష్మి, లక్ష్మణదాసు, రజనీకాంత్, సుజన, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి



కాంట్రాక్టర్లతో సమీక్షిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడ తూర్పు): ప్రజలకు ఇబ్బంది కలగకుండా రహదారుల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో కాంట్రాక్టర్లతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రహదారులను సకాలంలో పూర్తి చేయాలని, గడువులోపు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రోడ్లు, పేవర్ బ్లాక్స్‌తో ఉన్న ఫుట్‌పాత్ మరమ్మతులకు గుర్తైన చోట వాటిని వెంటనే సరిచేయాలని, భవిష్యత్తులో ఎలాంటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పనులు జరిగే క్రమంలో రహదారులపై నిర్మాణ వ్యర్థాలు వేయకుండా చూసుకోవాలని, పనుల అయిపోయిన తరవాత మెటీరియల్ తీసేసి పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. నగరాభివృద్ధిలో కాంట్రాక్టర్ల పాత్ర ఎక్కువగా ఉంటుందని చెప్పారు. కాంట్రాక్టర్లు పనులు సకాలంలో పూర్తిచేసే విధంగా, నాణ్యతా ప్రమాణాలు పాటించేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో చీఫ్ ఇంజినీర్ ఎం ప్రభాకర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో బాబాకు ప్రత్యేక పూజలు అభిషేకాలు గురువారం జరిగాయి. మందిర వ్యవస్థాపకుడు తంగెళ్ళమూడి వీరమోహనరావు బాబాకు విశేషంగా పూజలు చేశారు. శ్రీసాయి నక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన పారాయణం జరిగింది. మధ్యాహ్నం 700 మందికి అన్నప్రసాద వితరణ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని బాబాను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

స్వరకర్త కనకదాస జీవితం ఆదర్శప్రాయం

కలెక్టర్ ఢిల్లీరావు



కనకదాస చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సమాజంలోని ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా సంగీత, సాహిత్యాలతో అనుసంధానం చేసి తత్వజ్ఞానాన్ని అందించేందుకు ఎంతో కృషి చేసిన కన్నడ కవి, సంగీతకారుడు, స్వరకర్త కనకదాస జీవితం ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యాన సంగీతకారుడు కనకదాస జయంతి కార్యక్రమం గురువారం జరిగింది. తొలుత కలెక్టర్ ఢిల్లీరావు కనకదాస చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కన్నడ కురుబ కుటుంబంలో జన్మించిన కనకదాస విద్య ద్వారా జ్ఞానాన్ని సముపార్జించి సమాజాన్ని అన్ని కోణాల్లో సూక్ష్మ పరిశీలన చేశారని చెప్పారు. తద్వారా నల చరిత్ర, హరి భక్తిసార, నృసింహస్తవ, రామధ్యానచరితే, మోహన తరంగిణి తదితర రచనలు చేసి సమాజానికి దశదిశ చూపారని తెలిపారు. ఆయన మనకు అందించిన జ్ఞానాన్ని, వారసత్వ సంపదను ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని కలెక్టర్ ఢిల్లీరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి, ఇన్‌ఛార్జ్ బీసీ సంక్షేమశాఖ అధికారి ఎం.రుక్మాంగదయ్య, సహాయ బీసీ సంక్షేమశాఖ అధికారి హరిబాబు, సూపరింటెండెంట్ రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు



లక్ష పసుపు కొమ్ములతో మహాలక్ష్మి అమ్మవారికి అలంకరణ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లో వేంచేసి ఉన్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థాన చతుర్ధ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం పూర్ణాహుతితో వైభవంగా ముగిశాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారికి గురువారం లక్ష పసుపు కొమ్ములతో విశేషంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజైన గురువారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. తొలుత మహాలక్ష్మి అమ్మవారికి భక్తులు సారెను సమర్పించారు. అమ్మవారికి సారెను సమర్పించేందుకు విచ్చేసిన భక్తులను మేళతాళాలు, మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. అమ్మవారి ఆస్థాన కల్యాణ మండపంలో కలశ పూజ, మండప పూజల అనంతరం లక్ష కుంకుమార్చన నిర్వహించారు. 108 మంది మహిళలు ఈ విశేష కుంకుమార్చనలో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి వివిధ పుష్పాలతో పుష్పార్చన నిర్వహించారు. విశేష పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు లింగిపిల్లి అప్పారావుతో పాటు పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉభయ దాతలు వెంకట బుజ్జి కిరణ్, జయవాణి దంపతులచే మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు సుదురుపాటి ప్రసాద్‌శర్మ, రెంటచింతల విశ్వనాథ్‌లు శాస్త్రోక్తంగా జరిపించారు. అమ్మవారికి అలంకరించిన పసుపు కొమ్ములను లింగిపిల్లి తేజోరామనాథ్, అమ్మవారికి పట్టుచీరను పిళ్లా ఆదినారాయణలు సమర్పించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు అప్పారావు పేర్కొన్నారు.

గురజాడ రచనలతో ప్రజల్లో చైతన్యం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): గురజాడ అప్పారావు తన రచనల ద్వారా ప్రజలను చైతన్య పరిచారని సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు చెప్పారు. పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో గురజాడ వెంకట అప్పారావు 108వ వర్ధంతిని కళాశాల మైదానంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు భారతదేశ చిత్రపటం ఆకారంలో త్రివర్ణ టోపీలు ధరించి నిలబడ్డారు. పాలడుగు లక్ష్మణరావు ముఖ్య అతిథిగా విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. వ్యవహారిక తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులుతో కలిసి గురజాడ తెలుగు భాషోద్యమంలో చురుకుగా పాల్గొన్నారని చెప్పారు. ఆనాటి సమాజంలో ప్రబలిన సాంఘిక దురాచారాలను రూపుమాపేందుకు గురజాడ అప్పారావు ప్రజలను చైతన్య పరిచారన్నారు.

గురజాడను ఆదర్శంగా తీసుకోవాలి..

కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, కళాశాల డీన్ రాజేష్ సీ జంపాల మాట్లాడుతూ.. గురజాడ తన దేశభక్తి పాటలు, నాటకాల ద్వారా సమాజంలో యువతను ఎంతో ప్రభావితం చేసి సామాజిక మార్పుకు నాంది పలికారని చెప్పారు. గురజాడ సంఘ సంస్కరణలను నేటి యువతరం ఆదర్శంగా తీసుకుని విశాల దృక్పథాన్ని అలవరుచుకోవాలని సూచించారు. గురజాడ రచించిన దేశమును ప్రేమించుమన్నా మంచి అన్నది పెంచుమన్న అనే దేశభక్తి గేయాన్ని విద్యార్థులు పాడారు. కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఎస్.శివకుమార్ మాట్లాడుతూ.. గురజాడ అప్పారావు జీవిత విశేషాలను విద్యార్థులకు తెలియజేశారు. అధ్యాపకులు డాక్టర్ పి.నీరజ, డాక్టర్ మస్తాన్‌రావు, డాక్టర్ ఏవీ రమణమూర్తి పాల్గొన్నారు.

3న విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

భవానీపురం(విజయవాడపశ్చిమ): అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 3వ తేదీన జిల్లా స్థాయిలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సహాయ సంచాలకులు వి.కామరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు సంబంధించి జిల్లా స్థాయి విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు, స్వచ్ఛంద సంస్థల ద్వారా ప్రత్యేక పాఠశాలలో చదువుతున్న దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతుల కోసం పని చేస్తున్న వివిధ సంఘాలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దళిత,ఆదివాసీ స్త్రీలకు చట్టాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న రామకోటేశ్వరరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దళిత, ఆదివాసీ స్త్రీలు చట్టాలపై అవగాహన పెంచుకుని వాటిని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ప్రాసిక్యూషన్స్ అడిషనల్ డైరెక్టర్ బైరా రామకోటేశ్వరరావు అన్నారు. లెనిన్‌సెంటర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో దళిత ఆదివాసీ స్త్రీలు, బాలికలపై హింసకు వ్యతిరేకంగా దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం గురువారం జరిగింది. దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ ఝాన్సీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాధితులు ధైర్యంగా నిలబడితే తప్పక న్యాయం జరుగుతుందన్నారు. ప్రాసిక్యూషన్ కూడా బాధితులకు అండగా ఉంటుందని చెప్పారు. పీసీఆర్ సెల్ ఎస్పీ సురేష్ మాట్లాడుతూ తమ సిబ్బంది బాధితులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. సమావేశంలో ఎస్‌హెచ్‌ఆర్సీ సభ్యుడు జి.శ్రీనివాస్, మహిళా కమిషన్ సభ్యురాలు బూసి వినీత, దళిత స్త్రీ శక్తి జాతీయ కో-ఆర్డినేటర్ సత్య, హాన్స్ ఇండియా చీఫ్ బ్యూరో శ్యామ్‌సుందర్, సైకాలజిస్ట్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.